క్లుప్తంగా

పశ్చిమడెల్టాకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: ప్రస్తుతం కురుస్తున్న **వర్షాల నేపథ్యం**లో పశ్చిమడెల్టా ప్రధాన **కాలువకు నీటి** విడుదలను జలవనరుల శాఖ **ధవళేశ్వరం హెడ్ వర్క్స్** అధికారులు తగ్గిస్తున్నట్లు **వివరించారు.** గత మూడు రోజులుగా వర్షాలు కురవడంతో విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు 3,700 క్యూసెక్కులకు నీటి విడుదలను తగ్గించామన్నారు. ఈ మేరకు డెల్టా పరిధిలోని ఉప కాలువలైన నరసాపురం కాలువకు 1,501 క్యూసెక్కులు, తణుకుకి 328, ఏలూరుకు 696, ఉండికి 804, అత్తిలి కాలువకు 308 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

రేషన్ పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

నిడదవోలు రూరల్: రేషన్ కార్డుదారులకు సరకులు పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ డీలర్లను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ నుంచి 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు, మంచం పైనే ఉన్న రోగుల ఇంటి వద్దకే సరకులను పంపిణీ చేయాలని ఆదేశించారు. స్టాక్ విషయంలో తేడాలు లేకుండా చూసుకోవాలన్నారు. రేషన్ పంపిణీలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సివిల్ సప్లై డీటీ ఎం.అనిల్ కుమార్, డీలర్లు పాల్గొన్నారు.

రీ సర్వేపై అభ్యంతరాలను తెలపాలి



రీ సర్వే గ్రామసభలో రైతులతో మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

తాళ్లపూడి(కొవ్వూరు): అడిషనల్ సీసీఎల్, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డా.ఎస్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం మండలంలోని నందమూరు గ్రామంలో రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ సభలో పాల్గొని రైతుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేస్తున్నట్లు ఆయన వివరించారు. కావున రైతులు రీ సర్వేలో అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని కోరారు. అనంతరం సర్వేకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణీ సుస్మిత, తహసీల్దార్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ రుసుము తొలగింపు



తహసీల్దార్ లక్ష్మీ లావణ్య

తాళ్లపూడి: వెబ్ ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయిన భూ యజమానులు, తమ భూములను వ్యక్తి గతంగా విభజించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీ లావణ్య తెలిపారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో మండలంలోని రీసర్వే పూర్తి అయిన గ్రామాల రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది డిశంబర్ 31 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. భూమి విభజన కోసం వసూలు చేసే రూ.500 ప్రభుత్వ రుసుము పూర్తిగా తొలగించినట్లు వెల్లడించారు. కేవలం నామమాత్రపు రుసుము రూ.50 చెల్లించి సేవలు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని జాయింట్ పట్టాదారులు ఉపయోగించుకుని అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు పొందవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అర్జీదారులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

సుడిగాలి విధ్వంసం



గాలికి కూలిన ఇంటి పైకప్పు

గోపాలపురం: గోపాలపురం మండలం వేళ్ల చింతలగూడెం ఎస్సీ ఏరియాలో శుక్రవారం రాత్రి సుడిగాలులు విధ్వంసం సృష్టించాయి. ఈదురుగాలులకు ధాటికి 10 తాటాకు ఇళ్లు పూర్తిగానూ, మరో 20 ఇళ్లు పాక్షికంగానూ దెబ్బతిన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 8 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ గాలులు వీచడంతో ఈదురుగాలులకు కాలనీలో పలు ఇంటి పైకప్పులు లేచిపోయాయి. వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గాలులకు ధ్వంసమైన నివాసాల్లోని భాధిత ప్రజలను స్థానిక అంగన్‌వాడీ, కమ్యూనిటీ భవనాలకు అధికారులు తరలించారు. ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

లష్కర్లు ఏరీ..?

- కాల్వల పర్యవేక్షణకు సిబ్బంది కొరత
- గండిపడితే చూసే వారు కరవు
- ఆక్రమణల చెంత లాకు గట్లు
- పోస్టుల భర్తీపై దృష్టి సారించని అధికారులు



పెరవలి: ప్రాజెక్టులు నిండి కాల్వలకు నీటిని విడుదలచేస్తే వాటి నిర్వహణలో లష్కర్లది కీలక భూమిక. కాల్వల వెంట తిరుగుతూ ఎక్కడ గండిపడినా అధికారులకు సమాచారం ఇవ్వడం, నీటి చౌర్యం జరగకుండా అడ్డుకోవడం వీరి విధి. నీటి విడుదలకు ముందే ఎక్కడెక్కడ కట్టలు బలహీనంగా ఉన్నాయో గుర్తించి అధికారులను వీరు అప్రమత్తం చేస్తుంటారు. ప్రధాన కాలువలైన ఏలూరు, బ్యాంక్ కెనాల్, కాకరపర్రు, నరసాపురం కాలువలపై పర్యవేక్షణ చేయవలసిన లష్కర్లు లేకపోవటంతో సక్రమంగా నీటి ప్రవాహం జరగక రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఏ కాలువపై మెట్ట పంటలు ఉన్నాయో, వరిసాగు ఎంత జరుగుతుందో, ఎంత మేర **సాగు నీరు అందిస్తే పంట పొలాలకు సరిపోతుందో అనే అంశాలపై వీరికి పూర్తిగా అవగాహన ఉంటుంది. కాలువలు అడుగడుగునా ఆక్రమణ**లకు గురవ్వటంతో గట్లు కుచించుకుపోతున్నాయి. దీనికంతటికి కారణం పర్యవేక్షించే సిబ్బంది లేకపోవటమే కారణం అని ఇరిగేషన్ ఉద్యోగులు అంటున్నారు. ఒక్కొక్క లాకు వద్ద 20 నుంచి 30 మంది వరకు విధులు నిర్వర్తించవలసి ఉండగా నేడు కనీసం 10 మంది కూడ లేని దుస్థితి ఇరిగేషన్ శాఖది.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి

ఏలూరు కాలువ విజ్జేశ్వరంలో ప్రారంభమై ఏలూరు కృష్ణా కెనాల్‌లో కలుస్తుంది. 90 కిలోమీటర్ల విస్తీర్ణం. నిడదవోలు, తాడేపల్లిగూడెం రూరల్, పెంటపాడు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు మండలాలను కలుపుతూ వెళుతుంది. తాడేపల్లిగూడెం మున్సిపాలిటీతో పాటు నిడదవోలు, తాడేపల్లిగూడెం రూరల్, ఆచంట, తణుకు, ఉంగుటూరు, భీమడోలు మండలాల ఎన్నో గ్రామాలు ఉన్నాయి. చెత్తతోపాటు నిర్మాణాల వ్యర్థాలను గట్లపై వేస్తున్నారు. అవి చివరకు కాలువలోకి జారిపోతున్నాయి. రేవుల వద్ద కాలువలో దిగాలంటేనే మోకాలిలోతు బురద, పూడిక తీయకపోవడంతో రేవులు నిరుపయోగంగా మారుతున్నాయి. తాగునీటి సరఫరాలోనూ ఇబ్బంది ఎదురవుతోంది. ఇంతటి కీలక విధులు నిర్వహించే లష్కర్ల పోస్టుల భర్తీని ప్రభుత్వాలు ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా నిర్వహణ లేక కాల్వలు బలహీనంగా మారాయి.

సిబ్బంది కొరత

ఇంతటి ఘనచరిత్ర వున్న ఏలూరు కాలువ లష్కర్లు సిబ్బంది కొరతతో నిరాదరణకు గురవతు వస్తోంది. జిల్లాలో అత్యధిక సాగు భూమి ఈ కాలువ పరిధిలోనే ఉంది. దాదాపు 1.50 లక్షల ఎకరాల పంట భూమి ఈ కాలువ పరిధిలో సాగు చేస్తున్నారు. ఏలూరు కాలువ కోసం అప్పట్లోనే రూ.130 కోట్లతో పనులు చేసేందుకు ఏజెన్సీని ఖరారు చేశారు. కాలువ తవ్వకం, గట్లు పటిష్టత, రివిట్‌మెంట్ వాల్స్ నిర్మాణం, లాకులు, తూముల ఏర్పాటు, వంతెన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని వెంకయ్య వయ్యేరు, ఉండి, కాకరపర్రు, బ్రాంచ్ కెనాల్, గోస్తనీ కాలువల ఆధునికీకరణ పనులు అప్పట్లో దాదాపు పూర్తి చేశారు.

పోస్టుల భర్తీ అసాధ్యమే!

నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో నీరు సాఫీగా సాగకుండా గండిపడే ప్రమాదాలు ఉన్నాయి. లష్కర్లు, ఫిట్టర్‌లు, గేట్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎలక్ట్రీషియన్ల కొరత అధికంగా ఉంది. పెరవలి లాకుల పరిధిలో మొత్తం 27 మంది సిబ్బందికి ప్రస్తుతం కేవలం (ఒక ఏఈ, ఒక గుమ్మస్తా) ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో 9మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరందరి విధులు 9 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు. కానీ ఈ ఉద్యోగులకు గత నాలుగు నెలలు కాలంగా జీతాలు ఇవ్వకపోవటంతో వారు ఉన్న ఉద్యోగాలకి తిలోదకాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. గత 12 ఏళ్లుగా ఏ ఒక్క ఉద్యోగ నియమకాలు చేపట్టకపోవటంతో కాలువల పర్యవేక్షణ లేక రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఉన్న సిబ్బందికైనా మంచి భవనాలు లేక, పాత భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కొత్త ఉద్యోగులను నియమించి కాలువుల పర్యవేక్షణ సాగునీరు సక్రమంగా శివారు భూములకు అందేలా చేయాలని రైతులు, ఉద్యోగులు కోరుతున్నారు.



ఉసులుమర్రులో నీటి ప్రవాహం లేని కాలువ



పెరవలిలో కాలువ గట్టును ఆక్రమించుకుని కట్టిన భవనం

ఉద్యోగులను భర్తీ చేయాలి



పెరవలి లాకుల పరిధిలో ప్రస్తుతం ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగులతో పాటు 9 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందితో విధులను నెట్టుకొస్తున్నాం. వీరికి 4 నెలలుగా జీతాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. త్వరగా ఖాళీలను భర్తీ చేయాలి.

– బాల మురళీకృష్ణ,
ఇరిగేషన్ ఏఈ, పెరవలి మండలం

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి



ఆదర్శ ఉద్యోగులకు చెక్కు అందిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి

నిడదవోలు: ఆర్టీసీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి వై.సత్యనారాయణమూర్తి అన్నారు. పట్టణంలో ఆర్టీసీ డిపో గ్యారేజీలో శుక్రవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను ఘనంగా నిర్వహించారు. 2025 జూన్ నెలలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించిన కండక్టర్ ఎస్‌కే బాజీని, అత్యధికంగా ఇంధనాన్ని పొదుపు చేసిన డ్రైవర్ ఎండీ ఇర్ఫాన్‌బాబులను సత్కరించారు. ఇరువురికి నగదు బహుమతిని అందించి ప్రోత్సహించారు. వచ్చె నెల 15 నుంచి మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ప్రయాణం పథకం గురించి చర్చించారు. బస్సుల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని, వాటి నిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉద్యోగులకు సూచించారు. డిపో మేనేజర్ టి. ధనుంజయ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో అందరి సమిష్టి కృషితో డిపోను లాభాల బాటలో నడిపి, పూర్వ వైభవం తీసుకువద్దామని ప్రతిజ్ఞ చేయించారు. అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

దేవరపల్లి: ఆగస్టు నెలకు సంబంధించి 65 సంవత్సరాలు వయస్సు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో మంచానపడ్డ రోగులకు శనివారం నుంచి రేషన్ సరకులు పంపిణీ చేస్తున్నట్లు మండల తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరకులను ఇంటింటికీ తీసుకువెళ్లి డీలర్లు అందజేస్తారని ఆయన వివరించారు. సరుకుల పంపిణీ సమయంలో తనిఖీలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పల్లపు ప్రాంతాలు జలమయం



చాగల్లు శివారులో వర్షానికి నీట మునిగిన వరిచేలు



ఊనగట్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న పాపయ్య చెరువు

చాగల్లు: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వివిధ గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. శుక్రవారం ఉదయం వరకు వరకు 19.6 మీ.మీ వర్షపాతం నమోదు అయ్యింది. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపునీరు రావడంతో గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు ముంపునకు గురయ్యాయి. నిడదవోలు–పంగిడి ఆర్‌అండ్‌బీ రహదారిపై ఊనగట్ల వద్ద వర్షపునీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. పలు గ్రామాల్లో చెరువుల్లో నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బ్రాహ్మణగూడెం రావులచెరువు, ఊనగట్ల పాపయ్యచెరువు, ఊర చెరువు పొంగి ప్రవహిస్తున్నాయి. చాగల్లు. బ్రాహ్మణగూడెం, నందిగంపాడు, మార్కొండపాడు,దారవరం, ఊనగట్ల, ఎస్.ముప్పవరం తదితర పల్లపు ప్రాంతాల్లో వేసిన వరినాట్లు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి.

మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన



మాదకద్రవ్యాలతో నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

దేవరపల్లి: మాదకద్రవ్యాల నిషేధంపై స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు ఈగల్ టీం ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ బీడీఎస్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ పీవీ సూర్యమోహన్ మాట్లాడారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగం వీపరితంగా పెరిగిందన్నారు. నేటి యువత మత్తులో పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, బానిస కాకుండా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల రహిత భారత నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా డ్రగ్స్, మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన శిక్షలు తప్పవని అలాంటి వారు ఉంటే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఓ డి.ఆనంద ప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విక్రమ్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంజీ ప్రియాంక, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు ఎస్.వెంకటేష్, పి.రాము, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో తూడు తొలగింపు



ముంపు పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ



మురుగుకాలువలో పేరుకుపోయిన తూడును తొలగిస్తున్న కూలీలు

సాక్షి ఇంపాక్ట్

పెరవలి: కానూరు అగ్రహారం పరిధిలోని పంట కాలువలో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో మురుగునీరు పారక 25 ఎకరాల పొలాలు ముంపు బారినపడ్డాయి. ఈ ఘటనపై 'సాక్షి దినపత్రికలో' ఇటీవల 'ముంపులో పంటపొలాలు' అనే శీర్షిక వెలువడటంతో అధికారులు స్పందించి శుక్రవారం చర్యలు చేపట్టారని రైతులు తెలిపారు. ఈ మేరకు కానూరు అగ్రహారంలో నీటి మునిగిన పొలాలను తహసీల్దార్ నిరంజన్ ఎంపీడీఓ పద్మజ, వ్యవసాయాధికారి మేరీ కిరణ్, పంచాయతీ, ఉపాధి సిబ్బందితో కలసి ముంపు సమస్యపై రైతులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో కూలీలతో పనులు చేపట్టారు. సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన 'సాక్షి దినపత్రికకు' రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, రెవెన్యూ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పగుళ్లతో ఇక్కట్లు



ఉండ్రాజవరం-తణుకు ఆర్ అండ్ బీ రోడ్డు మార్గంలో బీటలు వారిన రోడ్డు

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం–తణుకు ఆర్ అండ్ బీ సీసీ రోడ్డు పగుళ్లు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో 18 ఏళ్ల క్రితం ఉండ్రాజవరం నుంచి తణుకు వరకు సుమారు రూ.4 కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్డు పలు ప్రాంతాల్లో బీటలు తీసింది. ఉండ్రాజవరం పెట్రోల బంక్ సమీపంలో రోడ్డు బీటలు వారడంతో ద్విచక్రవాహనదారులు పడిపోయిన ఘటనలను సైతం గుర్తుచేసుకుంటున్నారు. రోడ్డు సమస్యపై గతంలో పలుమార్లు ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఉండ్రాజవరం, పాలంగి తదితర గ్రామస్తులతో పాటు ద్విచక్ర వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటలు తీసినచోట (నేరలల్లో) తారు వేయాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా విలువిద్య పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఆర్చర్లు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జోనల్ స్థాయి విలువిద్య పోటీలు ఉత్సాహంగా జరిగాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన 70 మంది ఆర్చర్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆరు జోన్లకు చెందిన ఆర్చర్లు అండర్–14, 17, 19 బాలురు, బాలికల విభాగంలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ విభాగాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, సీఈఓ శ్రీమహశ్వి, ప్రిన్సిపాల్, క్రీడా సమన్వయకర్త శేషగిరిధర్ తదితరులు అభినందించారు.

హైవేపై కమ్ముకున్న చీకట్లు

- అలంకారంగా హైవే లైటింగ్
- మూడేళ్లుగా వెలగని లైట్లు



గొల్లగూడెం జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వీధిలైట్లు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన వీధి దీపాల స్తంభాలు అలంకారప్రాయంగా ఉన్నాయని స్థానిక ప్రజలు విమర్శలు చేస్తున్నారు. 2021–22 సంవత్సరంలో రహదారి విస్తరణలో భాగంగా గ్రామాల్లో రహదారికి ఇరువైపులా సుమారు 25 వీధిలైట్లను ఏర్పాటు చేశారు. రహదారి పరిధిలోని అన్ని గ్రామాల్లో సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేసిన అధికారులు గొల్లగూడెంలో రోడ్డుకు ఇరువైపులా స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ కాంతులతో గ్రామం సుందరంగా ఉంటుందని గ్రామస్తులు ఆనందపడ్డారు. కాని దీపాలు ఏర్పాటు చేసి మూడేళ్లు గడిచినా ఇంత వరకు మచ్చుకైనా ఒక్క లైటు కూడా వెలగలేదని గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రాత్రిళ్లు సైకిళ్లు పైన, కాలినడకన వెళుతున్న పాదచారులను వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలను గుర్తు చేసుకుని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సమస్యను పరిష్కరించి లైట్లు వెలిగించే ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వరాలివ్వు లక్ష్మీదేవి తల్లి



తాళ్లపూడి రాజ్యలక్ష్మీదేవి ఆలయంలో పుష్పాలంకరణలో అమ్మవారు

తాళ్లపూడి: ఆషాఢ మాసం ముగిసి, శుక్రవారం నుంచి శ్రావణమాసం ప్రారంభమైంది. హిందూ ధర్మంలో ప్రతీ మాసానికి ఓ ప్రత్యేకత ఉంటుంది. శ్రావణమాసంలోని అనేక పవిత్రమైన పూజలు, వ్రతాలు పాటిస్తారు. వరలక్ష్మీదేవిని పూజించడం ద్వారా సకల సౌభాగ్యంతో పాటు, ఆయురారోగ్యాలు కలుగుతాయని అర్చకుడు గోవర్ధనం చక్రవర్తి అన్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రం తాళ్లపూడిలోని శ్రీరాజ్యలక్ష్మీదేవి ఆలయంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా మహిళలు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అంకరించారు. తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి అమ్మవారిని పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో మహిళలు ఆలయాలకు వచ్చి పూజలు చేశారు. స్థానిక గోష్పాదక్షేత్రంలోని బాల త్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలోను, మెరకవీధి కనక దుర్గమ్మ ఆలయంలోను, కొవ్వూరమ్మ ఆలయంలోను, కుమారదేవం గండిపోశమ్మ ఆలయంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

శివునికి ప్రీతికరమైన శ్రావణమాసం

నిడదవోలు రూరల్: శివునికి ఎంతో ఇష్టమైన శ్రావణమాసం ప్రారంభమైన సందర్భంగా మండలంలోని మునిపల్లి గ్రామంలో మొదటి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కుంకుమార్చనలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సేంద్రియ పంటల సాగుపై శిక్షణ

దేవరపల్లి: సేంద్రియ వ్యవసాయంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండోవ రోజు శుక్రవారం దేవరపల్లి మండలం యాదవోలులో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండిస్తున్న వివిధ రకాల పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణం కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలుగా సాగు చేస్తున్న కోకో, మిర్చి, టమోటా, జామ, పంటలను పరిశీలించారు. 365 రోజులు (ఏటీఎం) పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి, దుంపజాతి పంటలను అధికారులు, సహాయకులు పరిశీలించారు. ఆదర్శ రైతు సింగులూరి రామ్మోహనరావు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వరి చేనును పరిశీలించారు. కషాయాల తయారీ గురించి వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై దేవరపల్లి, గోపాలపురం మండలాల వ్యవసాయాధికారులు కె.కమల్‌రాజ్, కె.ఏసుబాబు, డీఆర్‌సీ ఏఓ వెంకన్నబాబులకు అవగాహన కల్పించారు.